

పూర్ణాహుతిలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

కనుల పండువగా నాగప్రతిష్ఠ

వికారాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ తోటలో నిర్వహిస్తున్న ఎల్లమ్మతల్లి సహిత పరశురామ నాగప్రతిష్ఠ ఆదివారం కనులపండువగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆవాహిత పూజ, పిండికాన్యాసం, యంత్రాల ప్రతిష్ఠ, ప్రదక్షిణలు, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, బలి పూర్ణాహుతి, నైవేద్యం, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరినీ చల్లగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రత్నారెడ్డి, పట్టణ ప్రముఖులు, పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి

రామలింగేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌యాదవ్, రాజమల్లారెడ్డి, సందీప్ గౌడ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా మత్తు రాజ్యమేలుతోంది. ఇప్పటివరకు రాష్ట్ర రాజధానికే పరిమితమనుకున్న మత్తు గ్రామీణ ప్రాంతాలకు సైతం పాకింది. ప్రభుత్వం నిషేధించినా వివిధ రకాల డ్రగ్స్, గుట్కా, జర్దా మాఫియా పుంజుకుంటున్నది. కర్ణాటక, తెలంగాణ సరిహద్దుల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో రహస్య స్థావరాలు ఏర్పాటు చేసి దందా సాగిస్తున్నారు. పోలీసులు, ఆహార నియంత్రణ విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో రోజూ లక్షల రూపాయల వ్యాపారం జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే డ్రగ్స్ జాడలు కన్పిస్తున్నాయి. మత్తుకు పెద్దవారే కాకుండా యువతతోపాటు, మైనర్లు కూడా బానిసతున్నారు.

- ఇటీవల భారీగా పట్టుబడిన నిల్వలు
- బానిసలవుతున్న యువత, మైనర్లు
- రాష్ట్ర సరిహద్దుల్లో గుట్కా స్థావరాలు
- పరిగి మీదుగానే
- రాష్ట్ర రాజధానికి రవాణా



చర్యలు తీసుకుంటాం



మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పీడీ యాక్టు పెడతాం. నిషేధిత పదార్థాల తరలింపు, విక్రయాల గురించి సమాచారం ఇస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. అక్రమ వ్యాపారం చేసే వ్యక్తులు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటాం.

- నేతి శ్రీనివాస్, డీఎస్పీ పరిగి

జోరుగా మత్తు దందా

మస్తుగా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు!

పరిగి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పరిగి కేంద్రంగా మత్తు పదార్థాల వ్యాపారం జోరుగా సాగుతోంది. తాజాగా ఫిబ్రవరి 12న పరిగి మీదుగా తరలిస్తున్న గంజాయిని భారీ మొత్తంలో పట్టుకున్నారు. రెండు నెలల క్రితం ఓ యువకుడికి వద్ద గంజాయి లభిస్తే వదిలేశారు. అది ఆ నోటా, ఈ నోటా ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో ఆ యువకుడిని పట్టుకొని కేసు నమోదు చేసి జైలుకు తరలించారు. గుట్కాల మాటున గంజాయి, డ్రగ్స్ దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పరిగిలో స్థిరపడిన కొందరు వ్యక్తులు స్థానికులతో కలిసి దందా చేస్తున్నట్లు వినిపిస్తోంది. పరిగి కేంద్రంగా గంజాయి, కొకైన్, ఇతర మత్తు పదార్థాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. పరిగిలోని రెండు ప్రదేశాల్లో రాత్రి, తెల్లవారుజామున ఈ పదార్థాల క్రయ విక్రయాలు జరుగుతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

మత్తులో జోగుతున్న యువత

పరిగిలో కొంతకాలంగా మత్తుకు అలవాటుపడిన యువకుల సంఖ్య పెరుగుతోంది. రెండు చిన్నపాటి టీ స్టాళ్లలో సిగరెట్ల రూపంలో మత్తును సేవిస్తున్నట్లు సమాచారం. ఈ పదార్థాలను పూనే,

మిగతా 8వ పేజీలో...



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితులు(ఫైల్)

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని హైవిజన్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం ప్రకటనలో కోరారు. తల్లిదండ్రుల ఆదాయం నెలకు రూ.25 వేలు ఉండాలని, కింది తరగతుల్లో 80 శాతం మార్కులు వచ్చి ఉండాలన్నారు. పదో తరగతిలో 80 శాతంపైన మార్కులు వచ్చిన వారికి స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఈ నెల 17 వరకు అవకాశం ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కొరారు. మరిన్ని వివరాలకు రమేష్ (93973 92248), సుజాత (81067 67108), కృష్ణ (72079 96843)ను సంప్రదించాలని సూచించారు.



త్రుణమే ఘనం!

వ్యాధులకు విరుగుడు.. మిల్లెట్ ఫుడ్
పాత తరం ఆహారానికి మొగ్గు చూపుతున్న జనం
సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు 6

అతిథులు రాని గృహం

బషీరాబాద్‌లో ఆరేళ్లుగా నిరుపయోగం 8

వృథా.. పట్టింపులేదా?

గొంతులు తడపాల్సిన తాగునీరు గోతుల్లోకి..

- లక్షల లీటర్ల జలం రోడ్ల పైకి..
- పొలాలకు పారుతున్నా పట్టించుకోని అధికారులు
- నీటి వృథాను అరికట్టాలని కోరుతున్న ప్రజలు

ఘట్‌కేసర్/కీసర రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అసలే ఎండా కాలం.. బొట్టుబొట్టు ఒడిసి పట్టాల్సింది పోయి లక్షల కొద్ది లీటర్ల తాగు నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తాగు నీటి కోసం ప్రజలు తండ్లాడుతుంటే వందల కిలోమీటర్ల నుంచి తరలిస్తున్న తాగు నీరు ఏళ్ల తరబడి వృథాగా పోతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది నిర్లక్ష్యంతో రోడ్లపై ఏరులై పారుతోంది. రూ.వేల కోట్లు వెచ్చించి ఇంటింటికీ తాగునీరు అందించాలనే ప్రభుత్వ ఆశయం 'నీరు'గారిపోతోంది. ఘట్‌కేసర్ - కరీంగూడ రోడ్డులో ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి లక్షల కొద్ది లీటర్ల నీరు వృథాగా పోతోంది.




రోడ్డు పక్కన పారుతున్న నీరు

ఏళ్లుగా వృథాగా..

ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే ప్రముఖ పట్టణం, ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర వాసుల దాహార్తి తీర్చేందుకు హైదరాబాద్ నుంచి కృష్ణా జలాలను తరలించేందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీ పైపు లైన్ ఏర్పాటు చేశారు. నాగారం కరీంగూడ - ఘట్‌కేసర్ రోడ్డులో ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఒక ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మించారు. తొలి రోజుల్లో బాగానే ఉన్నా కొద్ది కాలానికి ట్యాంక్ పైనుంచి పెద్ద మొత్తంలో నీరు పొంగుతోంది. సంవత్సరాల తరబడి

మిగతా 8వ పేజీలో...



ట్యాంకు నుంచి వృథాగా పోతున్న తాగునీరు



25 టన్నుల పీడీఎస్ బియ్యం

పట్టివేత

మూడుచింతలపల్లి, మార్చి 9, (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిసున్న రేషన్ బియ్యాన్ని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. ఓఆర్ఆర్ వద్ద లారీని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ 23 యూ 5899 నంబర్ లారీలో నందిగామకు చెందిన డ్రైవర్ సర్దార్, క్లీనర్ చంద్రు దాదాపు 25 టన్నుల రేషన్ బియ్యాన్ని ఆటోనగర్ మలకోపేట్ నుంచి సిద్దిపేటకు తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు ఎస్‌వోటీ పోలీసులు శామీర్‌పేట్ ఓఆర్ఆర్ టోల్ గేట్ వద్ద పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అడుగంటిన జుంటివాగు

చుక్కనీరు లేక అల్లాడుతున్న మూగజీవాలు

తాండూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మూగజీవాల గొంతెండుతోంది. వేసవి ప్రారంభం కావడంతో కాల్వలు, చెరువుల్లో నీరు అడుగంటిపోయాయి. నీరు దొరక్క జీవాలు అల్లాడుతున్నాయి. తాండూరు మండలం గోనూరు గ్రామ శివారులోని జుంటివాగు పూర్తిగా ఎండిపోయింది. ఈ వాగు వద్దకు మండల పరిధిలోని గోనూరు, మాచనూరు తదితర గ్రామాల నుంచి పాడి రైతులు, పశువుల కాపరులు తమ పశువులను తోలుకుని వస్తుంటారు. చుట్టుపక్కల గడ్డితోపాటు వాగులో నీరు ఉండటంతో మూగజీవాలకు పుష్కలంగా తాగు నీరు ఉండేది. ప్రస్తుతం ఎండలు పెరగడంతో వాగులో చుక్కనీరు లేక మూగజీవాలు తాగు నీటి కోసం అల్లాడుతున్నాయి. అంతేగాక బోరు బావుల కింద పంటలకు సైతం నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

జుంటుపల్లి ప్రాజెక్ట్‌లో సమృద్ధిగా నీరు

జుంటివాగు నుంచి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న జుంటుపల్లి ప్రాజెక్టులో సమృద్ధిగా నీరుంది. ఆ ప్రాజెక్టు నుంచి నీరు కిందికి వదిలితే జుంటివాగులోకి నీరు చేరుతుంది. ప్రస్తుతం జుంటివాగులో నీరులేక మూగజీవాలు పడుతున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని జుంటుపల్లి ప్రాజెక్టు నీటిని వదిలేలా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ గోవింద్, రైతులు గోపాల్‌రెడ్డి, పాడి రైతులు కోరుతున్నారు.



తాండూరు మండలం గోనూరు శివారులో ఎండిపోయిన జుంటివాగు

మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో

ఐదుగురికి మెమోలు

» సిబ్బంది మధ్య సమన్వయ లోపంతో జారీ

తాండూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తాండూరు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఐదుగురికి సూపరింటెండెంట్ మెమోలు జారీ చేశారు. ఈ నెల 1న ఢిల్లీ పీఆర్సీ సెంట్రల్ బృందం సందర్శించినప్పుడు సరైన వివరాలు లేకపోవడంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి జనన, మరణ వివరాలు, చికిత్స పొందుతున్న వారి వివరాలు, సమగ్రంగా లేకపోవడంతో మెమోలు జారీ చేశారు. అయితే తాము వివరాలిచ్చినా సిబ్బంది డేటా ఎంట్రీ చేయలేదని మెమోలు జారీ అయిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో ఆధిపత్య పోరు కారణంగా పూర్తి వివరాలు సేకరించలేకపోతున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓకు బదులుగా డేటా ఎంట్రీ సిబ్బంది పెత్తనం చెలాయిస్తున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో న్యూట్రిషన్ కౌన్సిలర్, స్టాఫ్ నర్సులు, డీఈఓ, ఓపీ రిజిస్ట్రేషన్ సిబ్బందికి మెమోలు జారీ అయ్యాయి. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ హెచ్చరించారు. అయితే, ఆస్పత్రిలో సిబ్బంది మధ్య గ్రూపులు ఉండటంతో ఆర్ఎంఓ సిబ్బందితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమన్వయం చేశారు. ఈ విషయమై డీసీహెచ్ఓ వివరణ కొరగా సమస్యను పరిష్కరించామని, ఇకపై ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇచ్చిన మెమోలపై సిబ్బంది ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నట్లు తెలిపారు.

మరో రెండు గురుకులాలు

రెండో విడతలో తాండూరు, వికారాబాద్‌కు మంజూరు.. ఒక్కోదానికి రూ.200 కోట్లు కేటాయింపు

తాండూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లాకు మరో తీపికబురు అందించింది. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా 55 సమీకృత గురుకులాలు ఏర్పాటు చేయబోతున్నారు. ఇందులో వికారాబాద్, తాండూరుకు సమీకృత గురుకులాలను మంజూరు చేశారు. వికారాబాద్‌లో ఎస్సీ సమీకృత గురుకులాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. ఒక్కో సమీకృత గురుకులానికి రూ.200 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ క్లియరన్స్ ఇచ్చింది.



మొదటి విడతలో కొడంగల్‌కు ప్రాధాన్యం

ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కోడంగల్‌కు సమీకృత గురుకులం మంజూరై నిర్మాణానికి ఫిబ్రవరి 1న టెండర్లను ఆహ్వానించింది. ఆ ప్రక్రియ కొనసాగుతుండగానే మరో రెండు సమీకృత గురుకులాలను మంజూరు చేశారు. సమీకృత భవనం బ్లాక్‌ల వారీగా నిర్మాణం కానుంది. వీటిలో పరిపాలన బ్లాక్, అకాడమిక్ బ్లాక్, స్టాఫ్ క్వార్టర్స్, ల్యాబరేటరీ, ఆట స్థలం, పని చేసే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి నివాస సముదాయాన్ని ఏర్పాటు చేయనున్నారు.

25 ఎకరాల్లో నిర్మాణం

తాండూరు నియోజకవర్గంలోని యాలాల మండలం దౌలాపూర్‌లోని సర్వే నంబర్ 51లో సుమారు 25 ఎకరాల స్థలంలో సమీకృత గురుకులాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. ఇప్పటికే పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేయగా నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 109, 222, 223, 9 జీవోలను జారీ చేసింది. తాండూరులో గురుకులం ఏర్పాటు చేసేందుకు మొదటి నుంచి స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రయత్నం చేశారు. మొదటి విడతలో కోడంగల్‌కు ప్రాధాన్యత లభించినప్పటికీ రెండవ విడతలో తాండూరు, వికారాబాద్‌కు సమీకృత గురుకులాలు మంజూరు కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



తాండూరు నియోజకవర్గానికి సమీకృత గురుకులం మంజూరు చేయడం హర్షణీయం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. అతి పెద్ద సమీకృత గురుకులం మంజూరుతో ఈ ప్రాంత పేద విద్యార్థులు చదువుకోవడానికి ఎంతోగానో ఉపయోగపడుతుంది. వెంటనే పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాను.

- మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న రాజేశ్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

బొంరాస్‌పేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు, తండాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో ఆదివారం సీఆర్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.35లక్షలతో సీసీరోడ్డు, సైడ్ డ్రైనేజీ పనులకు కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాములు గౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సింహులు గౌడ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీపడం


కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

రంగారెడ్డి అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధిలో రాజీ పడేదిలేదని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడలో గ్రంథాలయ నిర్మాణం, ఎక్లాస్ఖాన్‌పేటలో ఎస్సీ కమ్యూనిటీ భవనాలకు ఆదివారం భూమి పూజ చేశారు. భైర్కాన్‌పల్లిలో నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా రూప్లానాయక్, రాజు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వై.యాదయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, ఆనంద్‌కుమార్, జగదీశ్వరప్ప, సురేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, సుందరయ్య, రమేష్, శ్రీనివాస్, గిరిధర్, శ్రీనివాస్, పర్వతాలు, కొడూరు రాములు, శివయ్య, నరేందర్‌రెడ్డి, గోపాల్, నారాయణ, బిక్షపతి, అనసూయమ్మ, లింగం, హరీశ్వర్, యాదగిరి పాల్గొన్నారు.

సీసీ రోడ్లు పటిష్టంగా వేయాలి

షాద్‌నగర్ అర్బన్: సీసీ రోడ్డు పనులను పటిష్టంగా చేపట్టాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. షాద్‌నగర్ పట్టణ 17వ వార్డులో 10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టే పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. వేసే రోడ్లు పది కాలాలపాటు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబర్‌ఖాన్, అగ్గనూరి విశ్వం, ప్రకాష్‌గౌడ్, తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, బస్వం, సర్వర్‌పాసా, జమ్రుద్, మోహన్, శ్రీశైలంగౌడ్, మురళీమోహన్, ఖదీర్, శ్రీను పాల్గొన్నారు.

శుద్ధ తాగునీటితోనే సంపూర్ణ ఆరోగ్యం

తలకొండపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శుద్ధమైన తాగునీటితోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, శతాబ్ది టౌన్షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గ్రామాల అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని కోరారు. రామకృష్ణాపురంలో శ్రీనివాస్‌రెడ్డి రూ.2 లక్షల సొంత డబ్బుతో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం ప్యాక్స్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, రెడ్‌క్రాస్ రాష్ట్ర సభ్యుడు అంజిరెడ్డిలతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి ఏళ్లుగా తోడ్పడుతున్న శ్రీనివాస్‌రెడ్డిని గ్రామస్థులు సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి, పేదరిక నిర్మూలనకు పెద్దపీట వేస్తోందని ఆయన చెప్పారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇతర పథకాలు వర్తింపజేస్తామని తెలిపారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోందని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్‌కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

త్రుణమే ఘనం!


- వ్యాధులకు విరుగుడు.. మిల్లెట్ ఫుడ్
- పాత తరం ఆహారానికి మళ్లుతున్న జనం
- పెరుగుతున్న త్రుణధాన్యాల వినియోగం
- డిమాండ్‌తో సాగుకు రైతుల ఆసక్తి


ఓ షాపులో అమ్ముతున్న చిరు ధాన్యాలు

చేవెళ్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పదేళ్లయినా నిండని పిల్లలకు షుగర్. 30ఏళ్లు దాటని యువకులకు బీపీ, షుగర్ వంటి అనారోగ్య సమస్యలు ఈ కాలంలో సాధారణంగా మారాయి. కల్తీ ఆహారం, ఎక్కువ కొవ్వు పదార్థాలున్న వాటిని తినడం, చేసేవృత్తి, పని ఒత్తిళ్లు, సమయపాలన లేని తిండి, నిద్రలేమి తదితర కారణాలతో చాలా మంది ఇలాంటి వ్యాధులు, రుగ్మతల బారినపడుతున్నారు. ఎందరు డాక్టర్లను సంప్రదించినా, ఎన్ని రకాల మందులు వాడినా అనారోగ్య సమస్యలు మాత్రం తీరడం లేదు. చివరికి సంప్రదాయ ఆహారం మాని పాత తరం త్రుణధాన్య పంటల ఆహారం తీసుకుంటేనే వ్యాధులు, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుగ్మగతలకు కొంతమేరైనా విరుగుడు ఉంటుందని అందరూ ఒప్పుకుంటున్నారు. అదే విధానాన్ని పాటిస్తున్నారు కూడా. చిరుధాన్య ఆహారంలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని వైద్యులు సైతం చెబుతున్నారు. ఈ కారణాల దృష్ట్యా ఆహారంలో చిరుధాన్యాల వినియోగం పెరిగి సాగు కూడా ఎక్కువైంది. వ్యాధి పీడితులైనా, సాధారణ వ్యక్తులైనా చాలా మంది తమ రోజువారీ ఆహారంలో మిల్లెట్స్(త్రుణ ధాన్యాల)వాడకాన్ని తప్పనిసరి చేసుకుంటున్నారు. తక్కువ కొవ్వు పదార్థాలు, ప్రోటీన్లు, చెక్కరలు ఉండే ఈ ఆహారమే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని ఎక్కువ మంది ప్రజలు భావిస్తున్నారు.

దీర్ఘాయుష్కులు.. మన పూర్వీకులు

పూర్వీకులు తిన్న ఆహారంతో రోజంతా ఉత్సాహంగా ఉండేవారు. నేటి వారితో పోలిస్తే వారి జీవిత కాలం కనీసం 10 నుంచి 15ఏళ్లు ఎక్కువే ఉండేది. మారిన ఆహార అలవాట్లతో ఇప్పుడు తరచూ అరోగ్య సమస్యలు వస్తున్నాయి. జంక్‌ఫుడ్, కల్తీ ఆహారం, కొవ్వు పదార్థాలతో మనిషి ఆయుర్దాయం తగ్గుతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. జొన్న, పజ్జొన్న, సజ్జ, కొర్రలు, రాగులు వంటి త్రుణధాన్య ఆహార వినియోగం పెరిగింది. వాటి ధరా ఎక్కువైంది. దీంతో రైతులు సాగుకు మక్కువ చూపుతున్నారు.



పెరుగుతున్న త్రుణధాన్యాల సాగు

చేవెళ్ల ప్రాంతంలో చిరుధాన్య పంటలు సాగవుతున్నాయి. గత వానకాలంలో జొన్న 3,226 హెక్టార్లలో, యాసంగిలో 1,946ఎకరాల్లో వేశారు. వరి, మిర్చి, పత్తి తదితర ఆహార, వాణిజ్య పంటలతో పోలిస్తే చిరుధాన్యాల సాగుకు పెట్టుబడి, శ్రమ తక్కువ. చీడపీడల బెడదా తక్కువే. మార్కెట్‌లో చిరుధాన్యాలకు మంచి డిమాండే ఉందని రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు.



జొన్నచేను

మిల్లెట్స్ ఆహారం దివ్యౌషధం



చిరుధాన్య ఆహారంలోని పోషకాలు కొన్ని శారీరక రుగ్మతులను దూరం చేస్తాయి. పోషకాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. వీటిని తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రోజూ డైట్‌లో చిరుధాన్య ఆహారం ఉంటే బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు, అలాగే వ్యాధి లేని వారికి అవి రాకుండా కూడా దోహదం చేస్తాయి.

- డాక్టర్ రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్, చేవెళ్ల ప్రభుత్వాస్పత్రి

















పురాతన విగ్రహం లభ్యం


లభ్యమైన పురాతన విగ్రహాన్ని కడుగుతున్న గ్రామస్తులు

బొంరాస్‌పేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బొంరాస్‌పేట్ మండలం ఎన్కెపల్లిలో ఆదివారం సీసీ రోడ్డు పనులకు ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతుండగా పురాతన విగ్రహం బయల్పడింది. అంజనేయస్వామి ఆలయ సమీపంలో పురాతన విగ్రహం లభ్యం కావడంతో గ్రామస్తులు విగ్రహానికి జలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. పలువురు గ్రామ దేవత విగ్రహమని, కొందరు ఆంజనేయస్వామి విగ్రహమని అన్నారు.

కేంద్ర మంత్రి సంజయ్‌కి ఘన స్వాగతం


మంత్రి బండి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఆదివారం మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న సంజయ్‌ని షాద్‌నగర్ వద్ద జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో కలిసి స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులను, కార్యకర్తలను సంజయ్ అప్యాయంగా పలకరించారు. స్వాగతం పలికిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, వంశీకృష్ణ, వెంకటేష్, ఎం.మురళి, ప్రశాంత్, నర్సింహ, శివ, సాయిగౌడ్, రఘుగౌడ్, జి.విజయ్, జి.రమేష్, గోపాల్, శ్రీనాథ్, రామకృష్ణ, రవినాయక్ ఉన్నారు.

టీయూడబ్ల్యూజే జిల్లా మహాసభను

విజయవంతం చేయాలి


శ్రీకాంత్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా రెండో మహాసభను విజయవంతం యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 11న మంగళవారం శంకరపల్లి మండలం పొద్దటూరులోని ప్రగతి రిసార్ట్స్‌లో నిర్వహించే మహాసభకు మీడియా అకాడమీ చైర్మన్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు మాజిద్, సత్యనారాయణ, నగునూరి శేఖర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, కార్యదర్శి రాంనారాయణ, పలువురు జాతీయ నాయకులు హాజరవుతారన్నారు. జర్నలిస్టులంతా మహాసభకు తరలి రావాలని వారు కోరారు. జిల్లాలో 25సంవత్సరాలకుపైగా సేవలందిస్తున్న జర్నలిస్టులను ఈ మహాసభల్లో సన్మానిస్తామని తెలిపారు. అన్ని నియోజకవర్గాల జర్నలిస్టులు హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.

ఎన్ఎస్‌యూఐ సోషల్ మీడియా

జిల్లా కో-ఆర్డినేటర్‌గా నరేందర్‌రెడ్డి

మంచాల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్‌గా కుకుడాల నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆరుట్లలో మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెదిరె సికిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నరేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సాతిరి ఎల్లేష్, రాఘవ, నాగరాజు, శంకర్, అశోక్, రాయుడు, చీరాల జంగయ్య, మంకు ప్రవీణ్, గుడిమల్ల చంద్రయ్య, మాసయ్యగౌడ్, కావలి బుగ్గ రాములు, మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, రావుల బాష, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


నరేందర్‌రెడ్డిని అభినందిస్తున్న మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న రవీందర్‌యాదవ్

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బైర్కాన్‌పల్లిలో బండలాగుడు పోటీలు ఆదివారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఎల్లనమోని రవీందర్‌యాదవ్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల విజేతకు మాజీ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్యయాదవ్ రూ.75వేలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, మాజీ జడ్పీటీసీ నర్సింగరావు, నాయకులు మురళీధర్‌రెడ్డి, యాదగిరి, ప్రేమ్‌కుమార్‌గౌడ్, వెంటయ్య, ద్రోణాచారి, సాజిద్, జమాల్‌ఖాన్. భాస్కర్, రామకృష్ణ, వేణుగోపాలచారి పాల్గొన్నారు.



నారపల్లిలో కట్టపోచమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి

ఘట్‌కేసర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం పోచారం మున్సిపాలిటీ పరిధి నారపల్లిలో కట్టపోచమ్మ ఆలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయాలు ఆధ్యాత్మిక చింతనకు దోహదపడతాయన్నారు. నిత్యం కొంత సమయాన్ని ఆలయల్లో గడపితే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు, వజ్రేష్ యాదవ్ సైతం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ రెడ్డియానాయక్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రవీందర్, శ్రీనివాస్, శేఖర్, మహేశ్, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, అంజన్‌కుమార్ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి, గోపాల్‌గౌడ్

ముగిసిన క్రికెట్ టోర్నీ

ఆదిభట్ల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పల్లె సుదర్శన్‌గౌడ్ జ్ఞాపకార్థం ఆదిభట్ల పరిధిలో పల్లె గోపాల్‌గౌడ్ నిర్వహించిన ఆదిభట్ల ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)-8 క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆదివారం మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో గెల్చిన మహాత్మ యూత్‌కు మొదటి బహుమతి రూ.46,000, రన్నర్స్ గుజరాత్ టైటన్స్‌కు రూ.28,000 అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆటల్లో గెలుపోటములు సహజమనీ, గెలిచినప్పుడు పొంగిపోకుండా, ఓడినప్పుడు బాధపడకుండా రెండింటినీ సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడాకారులకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కొరె జంగయ్య, శ్రీహరిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజు, నంరెడ్డి మహిపాల్‌రెడ్డి, నవీన్‌రెడ్డి క్రీడాకారులు పాల్గొన్నారు.



ప్రవీణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి రమ

ప్రవీణ్ అంత్యక్రియలు పూర్తి

- అమెరికాలో హత్యకు గురైన కేశంపేట యువకుడు
- మృతదేహం వద్ద నివాళులర్పించిన నేతలు
- శోకసంద్రంలో కుటుంబీకులు

రంగారెడ్డి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అమెరికాలో దుండగుల చేతిలో హత్యకు గురైన తెలంగాణ విద్యార్థి గంప ప్రవీణ్ అంత్యక్రియలు అతడి స్వస్థలం కేశంపేటలో ఆదివారం పూర్తయ్యాయి. అమెరికా నుంచి ప్రవీణ్ మృతదేహం తెల్లవారుజామున 4గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చింది. అక్కడ పోలీసుల ప్రక్రియలు పూర్తిచేసి 6గంటల ప్రాంతంలో మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరిక మేరకు నిమ్స్ ఆస్పత్రి అధికారులు మృతదేహాన్ని తరలించేందుకు ప్రత్యేక అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. కేశంపేటకు ప్రవీణ్ మృతదేహం రాకతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రవీణ్ తల్లి రమ కొడుకు మృతదేహాన్ని చూసి గుండెలు బాదుకున్నారు. అనంతరం ఆర్యవైశ్య సంప్రదాయంలో దహన సంస్కారాలు పూర్తిచేశారు. అంతకు ముందు ప్రవీణ్ మృతదేహం వద్ద షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి నివాళులర్పించారు.



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గరుడ వాహనంపై వేణుగోపాలుడు

తలకొండపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చుక్కాపూర్‌లోని కల్కిదోనగుట్టపై వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున స్వామి వారికి గరుడవాహన సేవ, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద రథోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఫౌండర్‌ట్రస్టీ పట్టాభిరామశర్మ, అర్చకుడు కృష్ణమూర్తి, నాయకులు శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, పెంటారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేశ్, పాండురెడ్డి పాల్గొన్నారు.



కల్తీ ఐస్‌క్రీమ్ ప్యాకెట్ల స్వాధీనం



కల్తీ ఐస్‌క్రీమ్ ప్యాకెట్లు



పోలీసుల అదుపులో నిందితులు

తాండూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కర్నాటక రాష్ట్రం నుంచి రవాణా చేస్తున్న కల్తీ ఐస్‌క్రీమ్‌లకు వినియోగించే ప్యాకెట్లను వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. నకిలీ కంపెనీల కోసం రవాణా చేస్తున్న ఫ్రూటీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, నిందితులను అదుపులోకి తీసుకొని వాహనాన్ని సీజ్‌చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బీదర్‌కు చెందిన ఓ వ్యాపారి కంపెనీ పేరు లేని ఐస్‌క్రీమ్ ప్యాకెట్లను తయారు చేసి వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్నారు. ఓ వాహనం(కేఏ32 డి5660)లో ప్యాకెట్లను రవాణా చేస్తుండగా తాండూరులో టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. తయారీ తేదీ, గడువు తేదీ లేని 67 ఐస్‌క్రీమ్ ప్యాకెట్ల బండళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బల్దియా.. మీ దయ!

- వెలగని వీధి లైట్లు, వృథాగా పోతున్న తాగు నీరు
- పట్టింపులేని ఇంజనీరింగ్ విభాగ అధికారులు
- ఇబ్బందుల్లో పట్టణ వాసులు

తాండూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగ అధికారుల పట్టింపు లేని ధోరణితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాల సక్రమంగా వెలగడం లేదు. నీటి సరఫరా విధానంలో అధికారుల చర్యలు తూతూ మంత్రంగా ఉంటున్నాయి. కమిషనర్ పర్యవేక్షణ కొరవడి, సిబ్బంది పనితీరు సరిగ్గా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.లక్షలు పోసి కొన్న లైట్లు నాసిరకంగా ఉండడంతో నెలరోజులకే పనిచేయడం లేదు. మరమ్మతుల పేరిట మరింత భారీ ఖర్చు చేస్తున్నారు. అయినా లైట్లు వెలుగక చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఐటీ రోడ్డులో స్ట్రీట్‌లైట్లు వెలగడం లేదని జనవరి 28న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు. ప్రస్తుతం లైట్లు మళ్లీ వెలగడం లేదు. కాలనీ వాసులు, రైల్వేస్టేషన్‌కు వెళ్లే వారు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పలు కూడళ్లలోనూ వీధి దీపాలు లేవు. బల్దియా ఇంజినీరింగ్ విభాగ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. అలాగే తాండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కాలనీలకు మంచి నీటి సరఫరాకు ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. ట్యాంక్ నిర్వహణను గాలికొదిలేశారు. ఈ ట్యాంక్ నిండి నీరంతా వృథాగా పోతోంది. గత శుక్రవారం రాత్రి ట్యాంక్ నిండి శనివారం ఉదయం వరకూ మైదానం అంతా నీరు పారింది. శనివారం రాత్రి వాల్వ్ బంద్‌చేయక నీరంతా వృథాగా పోయింది. ఈ ఫొటోలు స్థానికంగా సోషల్ మీడియాలో వైరలయ్యాయి. గ్రౌండంతా బురదమయమైంది. వాకింగ్ చేసే వారు, ఆడుకోవడానికి వచ్చే క్రీడాకారులు అధికారుల తీరుపై మండిపడ్డారు. నీటి సంరక్షణలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది. ఇకనైనా అధికారులు నీటి వృథాను అరికట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఇంతలా నీరు వృథా కావడంతో ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం కలిగింది.



తాండూరు ఐటీ రోడ్డులో వెలగని వీధి లైట్లు

సమస్యలను తెలుసుకోని కమిషనర్

గతంలో మున్సిపల్ కమిషనర్లు ఉదయం వార్డుల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించే వారు. ప్రస్తుత కమిషనర్ విక్రంసింహారెడ్డి మార్నింగ్ వాక్ చేయడం లేదు. దీనిపై స్థానిక కాంగ్రెస్ నాయకుడు సుభాన్‌రెడ్డి ఎమ్మెల్యేకు ఫిర్యాదు సైతం చేశారు. ఉదయం వార్డుల్లో తిరిగితే ఎక్కడ స్ట్రీట్ లైట్లు వెలగడం లేదు, చెత్త ఎక్కడ పేరుకుంటోంది? ఎక్కడైనా నీరు వృథాగా పోతోందా? అనేవి తెలుస్తాయి. లేదంటే ఆఫీసు వేళల్లో అయినా పట్టణంలో తిరిగి సమస్యలు తెలుసుకోవాలి. కానీ కమిషనర్ అవేమీ చేయడంలేదనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే తాండూరు మున్సిపల్ అధికారుల పనితీరుపై రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు హెచ్చరించినా వారి పనితీరులో మార్పు కన్పించడం లేదు.



తాండూరు జూనియర్ కళాశాల మైదానంలో వృథాగా పోతున్న ట్యాంక్ నీరు



మైసమ్మకు పూజలు నిర్వహిస్తున్న వంశీచంద్‌రెడ్డి, నాయకులు

దక్షిణాదిపై బీజేపీ వివక్ష

- సీడబ్ల్యూసీ సెక్రెటరీ చల్లా వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి, నిధుల పంపిణీపై వివక్ష చూపుతోందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలపై ప్రధానమంత్రి మోదీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కడ్తాలలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని ఆదివారం వంశీచంద్ సందర్శించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్‌లతో కలిసి మైసమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో స్నేహలత, అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలందజేశారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. దర్యాప్తు సంస్థలను అడ్డంపెట్టుకొని బీజేపీ రాజకీయ లబ్ధికి యత్నిస్తోందన్నారు. బీజేపీ నేతలు మత విద్వేషాలను రగుల్చుతూ దేశ విచ్ఛిన్నానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బిచ్యానాయక్, జగన్, జవహర్‌లాల్, చేగూరి వెంకటేశ్, శ్రీశైలం, హీరాసింగ్, సత్యంయాదవ్, కృష్ణానాయక్, తులసీరామ్, పి.శ్రీకాంత్, నరేందర్, ఫరీద్, రవీందర్ పాల్గొన్నారు.

గుడికి వెళ్లొచ్చేసరికి ...
ఇల్లు గుల్ల!

- 16.5తులాల బంగారు, 40 తులాల వెండి ఆభరణాల చోరీ

కీసర రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఓ కుటుంబీకులు దేవుడి మొక్కు తీర్చుకొని వచ్చే సరికి ఇల్లు గుల్ల అయ్యింది. ఈ ఘటన ఆదివారం కీసర మండలంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కూరగాయల వ్యాపారం చేసుకునే కొప్పుల లింగమ్మ, తన ఇద్దరు కుమారులతో నాగారం మున్సిపాలిటీలో ఉంటోంది. కుమారుల్లో ఒకరు టిఫిన్ సెంటర్ నడపుకుంటుండగా మరొకరు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. ఈ మధ్యనే చిన్న కొడుకు పెళ్లయింది. పెళ్లి తర్వాత పదమటి సోమారం లోని లింగబసవేశ్వర ఆలయం వద్ద నిద్ర చేస్తామని శనివారం సాయంత్రం వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికొచ్చే సరికి తాళం పగలగొట్టి ఉంది. బెడ్‌రూంలోని అల్మారాలో భద్ర పర్చిన 16.5తులాల బంగారు, 40తులాల వెండి ఆభరణాలు, రూ.25వేల నగదు దొంగలు ఎత్తుకపోయినట్టు గుర్తించారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.



వివరాలు సేకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న దీపక్‌జాన్

అనాథల సేవ.. భగవంతుడి సేవే

యాచారం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలను చేరదీసి చదివించడమంటే భగవంతుడిని సేవించడమేనని బాలాగ్రామ్ సంస్థ అనాథలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించడం అభినందనీయమని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. ఆదివారం తక్కళ్లపల్లితండా సమీప బాలాగ్రామ్ సంస్థ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. దేవుడిని ఎన్ని విధాలుగా, రూపాల్లో కొలిచినా ఒక్కటేనన్నారు. సంస్థలోని బాలలను బాగా చదివించి వారికి కొత్త జీవితాన్ని అందించడం గొప్ప విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సంస్థలకు ఇతోధికంగా సాయమందించాలని కోరారు. నిరుపేదల ఉద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో బాలాగ్రామ్ సంస్థ ఫాదర్ థామస్ రాంబల్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అంగోత్ వెంకటేష్ పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ల డిమాండ్లను నెరవేర్చాలి

రంగారెడ్డి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయానికి నడుపుతున్న క్యాబ్ డ్రైవర్ల డిమాండ్లను నెరవేర్చాలని టీజీపీడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ ఆదివారం పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టులో నడుపుతున్న ఓలా, ఉబెర్, ర్యాపిడో డ్రైవర్ల డిమాండ్లను నెరవేర్చేవరకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. వెహికల్ కిరాయిలను న్యాయంగా పెంచాలన్నారు. కొంత కాలంగా ఎయిర్‌పోర్టు అధికారులు, పోలీసులు తమ సమస్యలను పరిష్కరించడంతో ఆరోపించారు. డ్రైవర్లకు న్యాయం చేయకుంటే ఎయిర్‌పోర్టుకు వచ్చే ఇతర వాహనాలనూ అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు.

జీప్‌ల సామర్థ్య పరీక్షలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయ జీఎంఆర్ ఎరీనాలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జీప్(వాహనం)ల సామర్థ్య పరీక్షలు ఆదివారం ముగిశాయి. నోవాటెల్ హోటల్ సమీపంలో జీప్ వాహనాల సామర్థ్యం పరీక్షించేందుకు గుంతలతో ప్రత్యేక ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. వీటిపై జీప్‌ల విన్యాసాలు అకట్టుకున్నాయి. ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్న డ్రైవర్లు గతుకుల రోడ్డులో ఈ జీప్‌లను నడిపారు.





చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ప్రభుత్వ చేయూతతో పేదల్లో ఆత్మవిశ్వాసం

ఆమనగల్లు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పేదలను కష్టాలకడలి నుంచి బయటపడేసి వారు ఆత్మ విశ్వాసంతో బతకాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, గ్యారంటీ పథకాలతో పేదల కష్టాలు క్రమంగా తొలగుతాయని అన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ రూ.1.36 లక్షల విలువైన చెక్కులను ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అందజేశారు. వివిధ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పల్లెల్లో ప్రగతి కాంతులు నింపేలా సీఎం రేవంత్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడమే బీఆర్‌ఎస్ నాయకులు తమ దినచర్యల్లో భాగంగా పెట్టుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ వివిధ మండలాల అధ్యక్షులు కిషన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బిచ్యానాయక్, జగన్, మానయ్య, నాయకులు కాసు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, జక్కు అనంతరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, విఠలయ్యగౌడ్, హన్మనాయక్, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరేశ్, బాబ, విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడుదాం..

- సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

మంచాల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం పోరాటాలు కొనసాగిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. జాపాలలో నిర్మించిన కామ్రేడ్ కర్రె కోటప్ప స్మారక భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. భూమి, భుక్తిల కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన నాటి రైతాంగ సాయుధ పోరాటంలో కామ్రేడ్ కృష్ణమూర్తి నేతృత్వంలో అడివయ్య, జంగయ్య, జంగారెడ్డి, శ్రీరాం వెంకటయ్యలతో కలిసి కోటప్ప పాల్గొన్నారని గుర్తుచేశారు. స్వాతంత్ర్యానంతరం జాపాలకు ఏకగ్రీవ సర్పంచ్‌గా 30ఏళ్ల సేవలందించారని చెప్పారు. అమరుల ఆశయసాధనకు కృషిచేస్తామన్నారు. నేటి పాలకులు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సలసమస్యలపై పోరాడుతున్నది కమ్యూనిస్టులేనన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రావుల జంగయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి సుమలత, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లట్టుపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కె.పాపిరెడ్డి, వై.జగన్, బుగ్గరాములు, ఎస్.రాజు, ఆర్.స్వామి, లెనిన్, కె.జంగయ్య, భాస్కర్, వినోద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న పి.యాదయ్య

యువత భగవద్గీతను అనుసరించాలి



భగవద్గీత ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంతం ప్రభోద సేవాసమితి సభ్యులు

మేడ్చల్ టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) నేటి యువతరం భగవద్గీతను అనుసరించాలని త్రైతసిద్ధాంతం ప్రభోద సేవా సమితి ఇందు జ్ఞానవేదిక హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ గిరి అన్నారు. సేవా సమితి సభ్యులు ఆదివారం మేడ్చల్ పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, ఆర్టీసీ కాలనీలో భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి ఆచార్య ప్రబోధనంద యోగేశ్వరులు స్వామి వారు రచించిన 100ఆధ్యాత్మిక త్రైతసిద్ధాంత గ్రంథాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నర్సింహాచారి, ఎన్.ఎస్.కుమార్, మధు, పాపిరెడ్డి, జనార్దన్‌రావు, నాగమణి, లక్ష్మి పాల్గొన్నారు.

యాదవ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ నాయకులు

దుద్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరారంలో ఆదివారం యాదవ సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా దశరథ్, ఉపాధ్యక్షుడిగా అనంతయ్య, హన్మంతు, కోశాధికారిగా మొగులయ్య, కార్యదర్శులుగా నర్సింహులు, ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా ఆంజనేయులుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌యాదవ్, మండల అధ్యక్షుడు కె.నర్సిములుయాదవ్, ప్రధాన క్యాదర్శిగా వెంకటేశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు నర్సింహులు యాదవ్, అంజిలయ్యయాదవ్, వెంకటయ్యయాదవ్ పాల్గొన్నారు.

అతిథులు రాని గృహం!

● బషీరాబాద్‌లో ఆరేళ్లుగా నిరుపయోగం



బషీరాబాద్‌లోని అతిథి గృహం

బషీరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రజాప్రతినిధులు మండలానికి వచ్చిన సమయంలో సేద తీరడానికి రూ.15లక్షల వ్యయంతో బషీరాబాద్‌లో జిల్లా ప్రజా పరిషత్ అతిథి గృహం నిర్మించారు. ఈ భవనం 2018లో జడ్పీజీఎఫ్ నిధులతో నిర్మించినప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపంతో గడిచిన 6ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. భవనం లోపల దుమ్ము, ధూళి చేరి రోజురోజుకు పాడుబడుతోంది. కాగా ఈ భవనం నిర్మించిన నాటినుంచి ఏ ఒక్క రోజు కూడా ప్రజాప్రతినిధులు సేదతీరినా దాఖాలాలు లేవని చెప్పవచ్చు. ఇదిలా ఉండగా భవనం ఎదుట ఖాళీ స్థలాన్ని ప్రైవేటు వాహనాలు, లారీలను పార్కింగ్ చేసేందుకు పలువురు వినియోగించుకుంటున్నారు. సంబంధిత అధికారులకు ఇదంతా తెలిసినా మనకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాన్ని పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



పరిగి: ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు



పరిగి: చిగురాల్‌పల్లిలో బొంద్రాయి ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం గణపతిపూజ, విశ్వక్సేనపూజ, పుణ్యావచనం, స్వామి వారికి అభిషేకం, ధ్వజారోహణం, పంచగ్యపాశణ, గోవుపూజ, మృత్యుగ్రహణం, అంకురార్పణం, దీక్షాదారణం, రుత్సాంగవణం, సాయంత్రం తులసి అర్చన, కుంకుమ అర్చన, సాయంత్రం ఎదురుకోళ్ళ కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞానాలు, సుదర్శనయాగంలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు కూర్చున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో ఆలయకమిటి చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, భక్తులు పాల్గొన్నారు.

చిగురాల్‌పల్లిలో బొంద్రాయి ఉత్సవాలు

పరిగి మండలంలోని చిగురాల్‌పల్లి గ్రామంలో బొంద్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, పరిగి మాజీ జడ్పీటీసీ బి.హరిప్రియప్రవీణ్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఉత్సవాలకు రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. మాజీ జడ్పీటీసీ హరిప్రియ తరఫున రూ.42వేలు ఇచ్చారు. చిగురాల్‌పల్లి గ్రామంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. భక్తులందరికీ అన్నదానం చేశారు.



నవాబుపేట: నవగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య

వైభవంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన

నవాబుపేట: మండలంలోని నారేగూడ గ్రామ సమీపంలోని హనుమాన్‌ల గడ్డ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోరుగా మత్తు దందా?

(5వ పేజీ తరువాయి)



పరిగిలో గతంలో పట్టుబడిన గంజాయి(ఫైల్)

బీజాపూర్, గుల్బర్గా, సేడం ప్రాంతాల నుంచి గుట్టుగా పరిగికి తీసుకవచ్చి, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వినిపిస్తోంది. పరిగికి చెందిన ఒకరిద్దరు వ్యాపారులు ఈ దందాలో ఆరి తేరారని, వారికి పోలీస్‌శాఖలోని కిందిస్థాయి ఉద్యోగుల్లో ఒకరిద్దరు సహాయసహకారాలు అందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పరిగి శివార్లలో ఒకటిరెండు వ్యవసాయ క్షేత్రాల్లో స్థానిక యువతతో పాటు ఉన్నత వర్గాలకు చెందిన పిల్లలు చేరి మత్తుకు అలవాటు పడుతున్నట్లు సమాచారం.

యథేచ్ఛగా గుట్కా దందా

ప్రభుత్వం నిషేధించినా గుట్కా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఏ చిన్న షాపులో అడిగినా దొరుకుతోంది. గతంలో అధికారులు పరిగి ప్రాంతంలో చాలాసార్లు గుట్కా నిల్వలను పట్టుకున్నా దందాను మాత్రం అరికట్టలేకపోతున్నారు. తెలంగాణ, కర్ణాటక సరిహద్దుల్లో తయారీ, నిల్వ కేంద్రాలు కొనసాగుతున్నాయి. కర్ణాటకలోని గుల్బర్గా, గుర్మిటకల్, సేడెం, మల్కేడ్, బీదర్ తదితర ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో తయారీ, నిల్వ చేసి అక్కడి నుంచే దందా కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతాలకు చెందిన కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సమాచారం. కర్ణాటకలోని సేడెం, గుల్బర్గా, గుర్మిటకల్‌తోపాటు జిల్లాలోని తాండూరు కొడంగల్, పరిగి ప్రాంతాల్లో గుట్కా ప్యాకెట్లను నిల్వ చేస్తారు అక్కడి నుంచి వికారాబాద్‌తోపాటు, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇక్కడి నుంచే ఏకంగా రోజుకు రూ.10 లక్షల అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. తాండూరు, కొడంగల్, పరిగిలతోపాటు, హైదరాబాద్‌లో 100కు పైగా హోల్‌సేల్ కేంద్రాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.



ఇటీవల పరిగిలో పోలీసులు పట్టుకున్న గంజాయి

మోమిన్‌పేట్ సీఐగా వెంకట్



సీఐ వెంకట్

మోమిన్‌పేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్ సీఐగా జి.వెంకట్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన నవీన్‌కుమార్ బదిలీపై డీసీఆర్‌బీ వికారాబాద్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో ఐజీ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన జి.వెంకట్ మోమిన్‌పేట్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఉపాధి కల్పనకు చొరవ చూపాలి



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాండూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉపాధి కల్పించే విధంగా చొరవ చూపాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని కొంగరకలాన్‌లో గల ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులతో ఆదివారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మహిళలకు ఉపాధి కల్పించే విషయమై వారితో చర్చించారు. ముఖ్యంగా తాండూరులో మహిళలకు అవకాశాలు కల్పించాలని సూచించారు.

క్రైం కార్నర్

ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని.. యువకుడిపై యువతి మేనమామ దాడి



గొంతుపై గాయంతో నాని

షాద్‌నగర్ రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్నందుకు ప్రేమికుడిపై యువతి మేనమామ కత్తితో దాడిచేసిన ఘటన శనివారం రాత్రి షాద్‌నగర్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు.. షాబాద్‌కు చెందిన ఎమినోళ్ల నాని(23) షాద్‌నగర్ పట్టణానికి చెందిన నందిని(20) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈక్రమంలో 15రోజుల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పెళ్లి చేసుకున్నారు. దాంతో నందిని కనిపించడం లేదంటూ ఆమె కుటుంబ సభ్యులు షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న నాని, నందిని శనివారం రాత్రి షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తాను మిస్సింగ్ కాలేదని, ప్రేమించిన వ్యక్తితో వివాహం చేసుకున్నానని తెలిపారు. తామిద్దరం మేజర్ అయినందున ఎలాంటి కేసు నమోదు చేయకపోవడంతో పాటు తమకు రక్షణ కల్పించాలంటూ పోలీసులను కోరారు. అయితే, అనంతరం వారు పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు రాగానే నందిని మేనమామ రాజేశ్ నానితో దుర్భషలాడుతూ తన వెంట తెచ్చుకున్న పదునైన ఆయుధంతో నానిపై దాడి చేయడంతో గొంతు భాగంలో తీవ్ర గాయమైంది. పోలీసులు వెంటనే నానిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేశారు. అనంతరం అతడిని ఇంటికి పంపించారు. దాడి చేసిన రాజేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

డీసీఎం, కారు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు





నుజ్జునుజ్జయిన కారు, డీసీఎం

పూడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): డీసీఎం, కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని సోమన్‌గుర్తి గేట్ వద్ద హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. డీసీఎం, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైనట్లు సమాచారం. దీంతో అతన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ రికవరీ



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ గిరి

యాలాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పట్టుకుని బాధితుడికి అప్పగించారు. యాలాల ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బండవెలికిచర్ల గ్రామానికి చెందిన గాజుల రాములు రాజీవ్ గృహకల్ప సమీపంలోని ఎంసీహెచ్ ఆస్పత్రి వద్ద తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈమేరకు రాములు యాలాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీఈఆర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్‌ను పట్టుకున్నారు. ఆదివారం బాధితుడు రాములుకు ఎస్‌ఐ గిరి అప్పగించారు. అదేవిధంగా గ్రామానికి చెందిన లొంక గోవిందు జుంటుపల్లి గ్రామంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదుదారుడికి అందజేసినట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కులకచర్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బైక్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కులకచర్ల నుంచి కొత్తపల్లికి చెందిన రమేశ్(35) బైక్‌పై వెళ్తుండగా మక్తా వెంకటాపూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పాలమూర్‌కు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో వాసవీ సంఘం నాయకురాళ్లు

తాండూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తాండూరు వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపం ఆధ్వర్యంలో శనివారం రాత్రి వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సన్మానించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు కొట్రిక నాగలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి తన అత్తాగారు కొట్రిక సుశీలమ్మ జ్ఞాపకార్థం ఆర్యవైశ్య మహిళా క్రీడోత్సవాల్లో పాల్గొన్న వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రధాన కార్యదర్శి మంకాల స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎస్వీఆర్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు మహిళ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళ ఉద్యోగులను, మహిళ మాజీ ప్రజాప్రతినిధులను, మహిళా కార్మికులను సన్మానించనున్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మర్పల్లి మండల కేంద్రంలోని ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ వెనక ఎన్ఆర్ఈజీఎస్ రూ.10లక్షలతో ఆదివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు రాములు యాదవ్, బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సురేశ్, నాగేశ్, రామేశ్వర్, రాచన్న, లక్ష్మారెడ్డి, మల్‌రెడ్డి, మధుకర్ పాల్గొన్నారు.

వృథా.. పట్టింపులేదా?

(5వ పేజీ తరువాయి)



రోడ్డుపక్కన పారుతున్న కృష్ణాజలాలు

ఇదే పరిస్థితి నెలకొనడంతో పరిసరాలన్నీ జలమయం అవుతున్నాయి. పక్కనే ఉన్న కాలనీని ముంచెత్తుతున్నాయి. దారిన వెళ్లే వాహనదారులు తడిసి ముద్దవుతున్నారు. పక్కనే ఉన్న ఎకరాల కొద్ది వరి పంటకు నీరందుతుంది. ఐనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దెబ్బతింటున్న రోడ్డు

రోజురోజుకు ఎండలు ముదురుతుండడంతో ఉష్ణోగ్రతలు పెరిగి భూగర్భ జలాలు తగ్గిపోయాయి. ప్రతి నీటిబొట్టును కాపాడుకోవాల్సిన తరుణంలో లక్షల కొద్ది లీటర్ల నీరు వృథాగా పోతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దాదాపు కిలో మీటర్ వరకు ఈ నీరు ప్రవహించి ఔటర్ పక్కన పడమటి సాయిగూడ చెరువులోకి చేరుతున్నది. దీంతోపాటు ఘట్‌కేసర్ - కరీంగూడ రోడ్డు నీటి ప్రవాహంతో పాడైపోయింది. ఇంత జగురుతున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

వృథాను అరికట్టాలి



తాగునీటి వృథాను అరికట్టాలి. వేల కోట్ల రూపాయలు వెచ్చించి తరలిస్తున్న తారు వృథా చేయటం అంటే ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయటమే అవుతుంది. అవసరమున్న చోట వెంటనే మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

- దేశం రాజుగౌడ్, కరీంగూడ, నాగారం మున్సిపాలిటీ

రోడ్డు దెబ్బతిన్నది



ఎళ్ల తరబడి తాగునీరు ట్యాంకు నించి వృథాగా పోతుండడంతో రోడ్డు బాగా దెబ్బతిన్నది. నిత్యం కొన్ని గంటల పాటు ఇక్కడ రోడ్డుపై నీరు పారుతున్నది. ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు రోడ్డు పక్క నుంచి కాలువ తీసి నీటిని దిగువకు మళ్లించారు.

- సాన్యం జగదీష్, వాహనదారుడు, ఘట్‌కేసర్

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు ఘన నివాళి



రాజరత్నం భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న విఠల్‌రెడ్డి

బషీరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఏఎంసీ మాజీ చైర్మన్ రాజరత్నం(66) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న తాండూరు మాజీ ఎమ్మెల్యే తండ్రి పి.విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఇందర్‌చెడ్ నర్సిరెడ్డి, నాయకుడు పాండు రంగారెడ్డి, భీమప్ప తదితర నాయకులు బషీరాబాద్‌లోని నివాసానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజరత్నం మృతి బాధాకరమన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. అంతకు ముందు వివిధ పార్టీల నాయకులు ఇక్కడికి చేరుకుని సంతాపం తెలిపారు.

పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచడం సరికాదు

దోమ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు తనను దూరంగా ఉంచడం సరికాదని గుండాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రామ్‌గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో తనను దూరంగా ఉంచడం బాధ కలిగించిందన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు గత 5 సంవత్సరాలుగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికార పక్షంతో కొట్లాడి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసినట్లు తెలిపారు.

పగలు ఉక్కపోత.. రాత్రి వేళ చలి

దుద్యాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుడంటంతో ఉదయం 9 నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో మధ్యాహ్నం కాగానే ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులకు గురవుతున్నారు. పగలు ఎండ తీవ్రత, రాత్రి చలి తీవ్రత ఎక్కువ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పుల కారణంగా ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. అక్కడక్కడ జ్వరం, జలుబు, దగ్గుతో ప్రజలు బాధపడుతున్నారు. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండ తీవ్రత కారణంగా పాఠశాలలకు ఈనెల 15నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి



వ్యాపారులతో సమావేశమైన ఎస్‌ఐ అనిత

ధారూరు, మార్చి9(ఆంధ్రజ్యోతి): నేరాలు, దొంగతనాల నియంత్రణకు వ్యాపారులు పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ అనిత తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం స్థానిక వ్యాపారులతో సమావేశమై నేరాలు, దొంగతనాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుకాణాల లోపల, బయట సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణ యజమానులు దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో దుకాణాల యజమానులు సాయికుమార్, రాహుల్, రఘు, శేఖర్, షకీల్ బాబా, కరీం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మహనీయుడు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధులు

ఘట్‌కేసర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కోసం నిరంతరం పరితపించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధి మీసాల అరుణ్‌కుమార్ అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లలిత్ ప్రసాద్‌రావు అనే విద్యార్థి అంబేడ్కర్ వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, నర్సింగరావు, బాలయ్య, వెంకటేశ్వర్‌రావు, రాజేష్, శ్రీరామ్, అంజయ్య పాల్గొన్నారు.